దయానంద్‌యాదవ్‌కు రతన్ టాటా ఎక్స్‌లెన్సీ అవార్డు


దయానంద్‌యాదవ్

బర్కత్‌పుర, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త బండారి దయానంద్‌యాదవ్‌కు రతన్ టాటా ఎక్స్‌లెన్సీ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలంగాణ సిటి జెన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముది రాజ్ తెలిపారు. రతన్‌టాటా జయంతి సందర్భంగా ఈ అవార్డును ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 28న బొగ్గులకుంటలోని సారస్వత పరిషత్‌హాల్‌లో జరిగే కార్యక్రమంలో అవార్డు అందజేస్తున్నట్లు తెలిపారు. దయానంద్‌యాదవ్ ఓ వైపు పారిశ్రామికవేత్తగా మరో వైపు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు సహాయ సహకారం అందిస్తున్నారని అన్నారు. అందువల్ల ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.


శ్రీధర్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎన్.గౌతమ్‌రావు

ప్రజల విశ్వసనీయత కోల్పోయిన ప్రభుత్వం

బర్కత్‌పుర, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల విశ్వసనీయతను కోల్పోయిందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు ఆరోపించారు. శుక్రవారం బర్కత్‌పుర భూమన్నగల్లీలో పోలింగ్ బూత్ నెంబర్ 217లో సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు. బూత్ అధ్యక్షుడుగా శ్రీధర్ లోకండే ఎన్నికైన సందర్భంగా నియామక పత్రం అందజేసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్; కోశాధికారి ఏ.సూర్యప్రకాష్‌సింగ్, డివిజన్ ఎన్నికల అధికారి బుచ్చిరెడ్డి నాయకులు సుభాష్‌పటేల్, అరవింద్, క్షీరసాగర్, కృష్ణకుమార్, సత్యేందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ బాలికల గురుకులంలో స్వల్ప అగ్నిప్రమాదం

అంబర్‌పేట డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట తురాబ్‌నగర్‌లోని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం రాత్రి స్వల్ప అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. తురాబ్ నగర్‌లో స్థానికంగా ఓ శుభకార్యంలో పాల్గొన్న వారు బాణాసంచా కాల్చారు. ఈ సంఘటనలో పక్కనే ఉన్న గురుకుల పాఠశాల నాలుగో అంతస్తు నిర్మాణం జరుగుతున్న చెక్కలపై పడ్డాయి. దీంతో స్వల్పంగా మంటలు వచ్చాయి. స్థానికులు గమనించి మంటలను ఆర్పివేశారు.

తీరని హౌసింగ్‌బోర్డు షాపుల వివాదం

- 14 ఏళ్లుగా దుకాణాలు సీజ్
- వీధిన పడ్డ వ్యాపారులు

రాంనగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాగ్‌లింగంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ బోర్డుకు చెందిన దుకాణాల వివాదం 14 ఏళ్లగా ఓ కొలిక్కి రావడం లేదు. దుకాణాలను ప్రభుత్వం మూసి వేయడంతో అందులో వ్యాపారం చేసుకుని జీవనం సాగించే 49 కుటుంబాలు ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డాయి. తాము ఉపాధి కోల్పోయామని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఈ వివాదాన్ని పరిష్కరించి షాపులను తమకు అప్పగించాలని సదరు వ్యాపారులు కోరుతున్నారు.

బాగ్‌లింగంపల్లిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించిన హౌసింగ్ బోర్డు షాపులను ఓపెన్ యాక్షన్ నిర్వహించారు. దీనిలో ఎవరైతే ఎక్కువ అడ్వాన్స్ మూడు నెలల ఈఎండీలు చెల్లించిన వారికి హౌసింగ్ బోర్డు దుకాణాలను అలాట్ చేసింది. ఒక్కొక్క షాపు విస్తీర్ణం 100, 150, 200 కలిగి ఉంది. వాటిని అద్దెకు తీసుకుని కొందరు వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారు. 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ షాపుల అద్దెలను రద్దు చేసి విక్రయానికి సిద్ధం చేసింది. అయితే మార్కెట్ ధర ప్రకారం ఎస్ఎఫ్‌టీకి 2 వేల రూపాయల ధర నిర్ణయించింది. కానీ అందులో కిరాయి ఉంటున్న వ్యాపారులు తాము ఎస్ఎఫ్‌టీకి వెయ్యి రూపాయల చొప్పున తమకే విక్రయించాలని హౌసింగ్ బోర్డు అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇద్దరి మధ్య విక్రయ ధర వెయ్యి రూపాయల తేడా రావడంతో అటు ప్రభుత్వం తగ్గ లేదు ఇటు కిరాయిదారులు ఆ ధర చెల్లించడానికి ముందుకు రాలేదు. దీంతో హౌసింగ్ బోర్డు అధికారులు 49 షాపులకు నోటీసులు ఇచ్చి పోలీసు బందోబస్తుతో వచ్చి ఉన్నఫలంగా ఆ దుకాణాలను సీజ్ చేసింది. అప్పటి నుంచి ఈ షాపులన్నీ మూతపడ్డాయి. వ్యాపారస్తులు వీధిన పడ్డారు. దీంతో షాపు యజమానులు అప్పటి నుంచి ఆ షాపులను తమకు కేటాయించాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అయినా ప్రభుత్వం స్పందించలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి సైతం వినతిపత్రాలు అందజేశారు. అయితే దుకాణాల సమస్య ఎప్పటికి తీరేనో తెలియడం లేదు.


బాగ్‌లింగంపల్లిలో మూతపడిన హౌసింగ్ బోర్డు దుకాణాలు

ఎస్ఎఫ్‌టీకి వెయ్యి చొప్పున ఇవ్వాలి



బాగ్‌లింగంపల్లిలోని హౌసింగ్ బోర్డు దుకాణాలను కిరాయిదారులకు ఎస్ఎఫ్‌టీ వెయ్యిరూపాయల చొప్పున రిజిస్ట్రేషన్ చేయించి వాటిని తెరిపించాలి. 14 ఏళ్లుగా షాపులు మూతపడి ఉండడం వల్ల అవి నిరుపయోగంగా మారాయి. నిర్వహణ లేకపోవడంతో ఆ షాపులు శిథిలావస్థకు చేరుకున్నాయి. వెంటనే హౌసింగ్ బోర్డు అధికారులు స్పందించి మధ్యేమార్గంగా పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ఒక సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాం.

- శ్యామ్‌యాదవ్, హౌసింగ్ బోర్డు షాపు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు


వీఎస్టీ చౌరస్తాలో వరదనీటి పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవిచారి

వీఎస్టీ చౌరస్తాలో పైప్‌లైన్ పనులను పూర్తి చేయాలి

రాంనగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వీఎస్టీ చౌరస్తాలో వర్షం నీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. బస్‌భవన్ నుంచి వీఎస్టీ వరకు మెయిన్ రోడ్డులో వర్షం పడి నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు నెలకొంటున్నాయన్నారు. శుక్రవారం వీఎస్టీ చౌరస్తాలో జీహెచ్‌ఎంసీ నిర్వహిస్తున్న వరదనీటి పైప్‌లైన్ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, బీజేపీ నేతలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయం హుండీ ఆదాయం రూ.2.10 లక్షలు

చిక్కడపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం హుండీ ఆదాయం 2 లక్షలా 10 వేలా 330 రూపాయలు వచ్చింది. శుక్రవారం ఆలయం ఆవరణలోని సీతారామకల్యాణమండపం ప్రాంగణంలో 50 రోజుల హుండీ ఆదాయాన్ని ఆలయ సిబ్బంది, భక్తులు దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ, ఆలయ పునఃనిర్మాణ కమిటీ చైర్మన్ జానకిసుధాకర్, ఈవో మాచర్ల దేవనాదం పర్యవేక్షణలో లెక్కించారు. కార్యక్రమంలో ముఖ్యఅర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ, కమిటి సభ్యులు హరీష్, సుబ్బారావు, ఎ.బాలకుమార్ పాల్గొన్నారు.


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

మహిళల రచనలు సమాజానికి దర్పణాలు

చిక్కడపల్లి: మహిళల రచనలు సమాజానికి దర్పణాలు అని ప్రభుత్వ పూర్వ సలహాదారు డా.కేవీ రమణాచారి అన్నారు. లేఖిని సంస్థ రచయిత్రులు సమష్టిగా 74 మంది కథలతో ప్రచురించిన 'కథల లోగిలి' పుస్తకావిష్కరణ సభ శుక్రవారం త్యాగరాయగానసభలో లేఖిని ఆధ్వర్యంలో జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన రమణాచారి మాట్లాడుతూ కథల లోగిలి పుస్తకం లేఖిని ప్రతిష్ఠను మరింత పెంచిందన్నారు. ప్రముఖ రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో అత్తలూరి విజయలక్ష్మి, అల్లూరి గౌరీలక్ష్మి, జానకి పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

అంబర్‌పేట ఫ్లై ఓవర్‌ను పూర్తి చేయండి

ప్రభుత్వానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ విజ్ఞప్తి


శ్యామ్‌నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్

గోల్నాక, డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట ఫ్లై ఓవర్ నిర్మాణం పనులు గత ఐదేళ్లుగా కొనసాగుతుండడంతో ప్రజలు అనేక ఇబ్బందుల పాలవుతున్నారని, పనులు 90 శాతం పూర్తయ్యాయని ఇంకా 10 శాతం పనులు ఉన్నాయని వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఫ్లైఓవర్ నిర్మాణం పనులు ఐదేళ్లుగా కొనసాగుతుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. శుక్రవారం గోల్నాక డివిజన్ శ్యామ్‌నగర్‌లో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం వారు బస్తీలో పర్యటించి ప్రజలను కలుసుకుని సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒకవైపు అంబర్‌పేట ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు, మరోవైపు మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పనులు కొనసాగుతుండడంతో అంబర్‌పేట ప్రజలు నిత్యం ట్రాఫిక్ బాధలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎ.సురేష్‌గౌడ్, ముడిగ నర్సింగ్‌యాదవ్, వై.బుచ్చిరెడ్డి, ప్రభాకర్‌ముదిరాజ్, కిషన్‌సింగ్, ఎం.సత్యనారాయణ, యూసుఫ్ షరీఫ్, శేఖర్, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డి

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

రాంనగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ సమావేశం, 2025 నూతన సంవత్సరం డైరీని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు న్యాయపరమైన బెనిఫిట్స్ అందించాలన్నారు. ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్, పెన్షనర్స్ జేఏసీ సెక్రటరీ జనరల్ సుబాకర్, రచయిత్రి జూపాక సుభద్ర, పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వి.ఆర్.దేశ్‌పాండే, ప్రధాన కార్యదర్శి ఎం.వి.నర్సింగ్ రావు, కోశాధికారి బైరి నర్సయ్య, ఉపాధ్యక్షులు రాంమనోహర్, నగర అధ్యక్ష, కార్యదర్శి కృష్ణప్రసాద్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకట్

చిక్కడపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా దండి వెంకట్ ఎన్నికయ్యారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 14, 15 తేదీల్లో పార్టీ రాష్ట్ర ప్రథమ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎస్ సిద్ధిరాములు ఎన్నికైనట్లు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా సూర్యప్రకాష్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యక్షుడిగా పబ్బని లత, నిజామాబాద్ ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, సిరిసిల్లా జిల్లా ఉపాధ్యక్షులుగా శ్రీశైలం, నాగరకర్నూల్ కార్యదర్శులుగా ఎంఎంగౌడ్, సూర్యాపేట జిల్లా కార్యదర్శిగా సాయి కృష్ణ, కామారెడ్డి సహాయ కార్యదర్శిగా సునీల్, రాష్ట్ర కమిటీ సభ్యులుగా జగదీష్, గంగాశంకర్, రాజేందర్, జ్యోతి, సయ్యద్, గంగామణి,చాట్ల పోశవ్వ, కళ, మహమూద్, అరుణ, అజయ్, శ్రీహరి, రాజులు ఎన్నికైనట్లు తెలిపారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి: ఎమ్మెల్యే

ముషీరాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంతో పాటు కార్పొరేట్ వైద్య సంస్థలు మానవత దృక్పదంతో పేద ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ కోరారు. శుక్రవారం ముషీరాబాద్ ఫిష్‌మార్కెట్‌లోని గంగపుత్ర సంఘం భవనంలో రోటరీ క్లబ్ హైదరాబాద్ ఈస్ట్, ఎం.ఎన్.జె క్యాన్సర్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దీన్‌దయాల్‌రెడ్డి సహకారంతో మహిళలకు ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ముఠాగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి అని సూచించారు. ప్రైవేటు, కార్పొరేట్ వైద్య సంస్థలు పేదలు నివసించే ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి వారికి వైద్యం అందించాలని కోరారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా అతిథులను, డాక్టర్లను దీన్‌దయాల్ రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, రోటరీ క్లబ్ అధ్యక్షుడు టీఎంఎన్ చౌదరి, డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి కోఆర్డినేటర్ ప్రసాద్, కార్యదర్శి రాధేశ్యామ్, ముషీరాబాద్ డివిజన్‌బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు డి. శివముదిరాజ్, శ్రీధర్‌చారి, సయ్యద్ అహ్మద్ భక్తియార్, టెంట్‌హౌస్ శ్రీనివాస్, ముచ్చకుర్తి ప్రభాకర్, సదా పాల్గొన్నారు.

కాచిగూడ రైల్వే స్టేషన్‌లో యువతి అదృశ్యం

బర్కత్‌పుర, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ రైల్వేస్టేషన్‌లో యువతి అదృశ్యమైంది. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన నారాయణ కుమార్తె హేమావతి (24) ప్రైవేట్ ఉద్యోగి. శుక్రవారం తెల్లవారుజామున కర్నూలు నుంచి రైలులో కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వచ్చింది. బాత్రూమ్‌కు వెళ్లి వస్తానని తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ప్లాట్‌ఫారాలపై వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు


వి.ప్రభాకరరావును సన్మానిస్తున్న కోట శ్రీనివాసరావు

ఘంటసాల గంధర్వగాయకుడు

- ప్రముఖ సినీనటుడు కోట శ్రీనివాసరావు

చిక్కడపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల గంధర్వగాయకుడు అని ప్రముఖ సినీనటుడు కోట శ్రీనివాసరావు అన్నారు. ఘంటసాల, మాధవపెద్ది సత్యం, ఎన్టీఆర్, ఏఎన్నార్ వంటి వారు కారణజన్ములని ఆయన పేర్కొన్నారు. ప్రముఖ మహిళా సంస్థ రాగరాగిణి ఆధ్వర్యంలో శుక్రవారం త్యాగరాయగానసభలో ఘంటసాల జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ గాయకులు వి.ప్రభాకరరావుకు ఆత్మీయసత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోట శ్రీనివాసరావు మాట్లాడుతూ ధ్వని ఉన్నంత కాలం ఘంటసాల స్వరం బతికే ఉంటుందన్నారు. ఘంటసాల పోయేంతవరకు పాడుతూ గాయకుడుగానే బతుకుతూ 110 సినిమాలకు సంగీత దర్శకత్వం వహించారని ఇది ఇండియన్ స్క్రీన్‌లో విశేషమన్నారు. పాత సినిమాలు చూస్తుంటే తెలుగుపద్యం ఘంటసాల, మాధవపెద్ది సత్యంతోనే పోయిందా అని అనిపిస్తోందన్నారు. నేటి తరానికి మన తెలుగు భాష మాధుర్యాన్ని తెలియజేయాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో మైన్స్ రిటైర్డ్ డైరెక్టర్ వీడీ రాగోపాల్, నిర్వాహకులు రమణకుమారి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రమణకుమారి, శశిరేఖ, కనక, నిర్మల, దినకర్, ఎస్‌బి ఖాసిమ్, విజయమార్, కమలాకర్‌లు ఘంటసాల గీతాలను ఆలపించారు.

టీడీపీ సభ్యత్వానికి అనూహ్య స్పందన

పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు

అంబర్‌పేట డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో టీడీపీ సభ్యత్వానికి అనూహ్య స్పందన లభిస్తోందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు పేర్కొన్నారు. అంబర్‌పేట డివిజన్ బాపూనగర్‌లో జరిగిన టీడీపీ సభ్యత్వ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు లక్ష సభ్యత్వం జరిగిందన్నారు. వంద రూపాయలు చెల్లించి సభ్యత్వం తీసుకున్న వారి 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా, అంబర్‌పేట నియోజకవర్గం నాయకులు ఓ.వెంకటేష్‌చౌదరి, భానుప్రకాష్, సత్యనారాయణ, కిరణ్, పి.అశోక్, జగదీష్, విక్రమ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదులో బక్కని నర్సింహులు, సాయిబాబా తదితరులు

చదువుతో పాటు ఏకాగ్రత అవసరం

చిక్కడపల్లి, డిసెంబర్ 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు ఏకాగ్రత అవసరమని ప్రముఖ సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు అన్నారు. అశోక్‌నగర్‌లోని గీతాంజలి ఉన్నత పాఠశాల 42వ వార్షికోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం త్యాగరాయగానసభలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏకాగ్రతతోనే ఏదైనా సాధించవచ్చునన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల వ్యవస్థాపకులు, సినీ రచయిత సీఎస్‌రావు జయంతిని పురస్కరించుకుని పరుచూరి వెంకటేశ్వరరావుకు నగదు పురస్కారం, సీఎస్‌రావు మెమోరియల్ థియేటర్ అవార్డును బహూకరించారు. కార్యక్రమంలో సినీనటి ప్రీతినిగమ్, సెంట్రల్ యూనివర్శిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డీఎస్ఎన్ మూర్తి, సినీ గేయరచయిత సిరశ్రీ, సినీనటుడు నాగేశ్ కర్రా, పాఠశాలప్రధానోపాధ్యాయురాలు ఎన్ శాంత, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నారు.


మహాపడి పూజ నిర్వహిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి దంపతులు

కనులపండువగా అయ్యప్ప మహాపడి పూజ

రాంనగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం అంబర్‌పేటలోని వారి నివాసంలో కన్నులపండువగా శ్రీఅయ్యప్ప స్వామి మహాపడి పూజ జరిగింది. ఈ పూజ సందర్భంగా భక్తబృందంచే శ్రీఅయ్యప్ప భక్తిగీతాలాపనతో పరిసర ప్రాంతాలలో శ్రీఅయ్యప్ప నామస్మరణతో మారుమ్రోగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్‌రావు, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సతీమణి మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మావెంకటేష్‌లు హాజరయ్యారు. అనంతరం అయ్యప్ప స్వాములు, భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహాపడి పూజ

రాంనగర్‌లోని స్ట్రీట్ నెంబర్ 18లో శుక్రవారం సాయి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీఅయ్యప్ప స్వామి మహాపడి పూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ ముఖ్యఅతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములకు ఆల్పాహారం, భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

బ్రాహ్మణ సమ్మేళనానికి హాజరు కావాలని సీఎంకు ఆహ్వానం

రాంనగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న రవీంద్రభారతిలో జరిగే బ్రాహ్మణ మహా సమ్మేళనానికి హాజరు కావాలని సీఎం రేవంత్‌రెడ్డిని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సుశీల్‌కుమార్, సుధాకర్ శుక్రవారం మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. మన ప్రభుత్వం మన ప్రగతి పేరుతో అసోసియేషన్ 10వ వార్షికోత్సవం సందర్భంగా ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమ్మేళనానికి రాష్ట్రవ్యాప్తంగా బ్రాహ్మణులు పాల్గొంటారని వారు తెలిపారు.

గోల్నాక డీ మార్ట్‌పై కేసు

ఎండు మిర్చి ప్యాకెట్ల ముద్రణలో అవకతవకలు

గోల్నాక: గోల్నాక గంగానగర్‌లోని డీమార్ట్‌పై కేసు నమోదైంది. ఎండు మిర్చి ప్యాకెట్ల తూనికలో మోసం జరిగిందని ఓ వినియోగదారుడు ఇచ్చిన ఫిర్యాదు మేర కు తూనికలు కొలతల అధికారులు కేసు నమోదు చేశారు. అన్నపూర్ణనగర్‌కు చెందిన సాయి గురువా రం గోల్నాకలోని డీమార్ట్ వెళ్లి సుమారు రూ.8500ల విలువైన నిత్యావసర సరుకులు కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లాక సరుకులు సర్దుకునే సమయంలో ఎండుమిర్చి ప్యాకెట్లపై అనుమానం వచ్చి పరిశీలించగా 500 గ్రాముల మిర్చి ప్యాకెట్‌పై రూ.299 అని ఉంది. కానీ ప్యాకెట్‌లో మాత్రం 100 గ్రాములు మాత్రమే ఉండడంతో అవాక్కయ్యాడు. వెంటనే డీ మార్ట్‌కు వెళ్లి విషయాన్ని ఇన్‌చార్జికి చెప్పాడు. 'ఏం చేస్తావో చేసుకో' అని దురుసుగా సదరు ఇన్‌చార్జి మాట్లాడడంతో వినియోగదారుడు జిల్లా తూనికలు, కొలతల అధికారులకు సమాచారం ఇచ్చాడు. స్పందించిన అధికారులు డీ మార్ట్‌కు చేరుకుని మిర్చి ప్యాకెట్లను పరిశీలించి అవకతవకలు ఉన్నట్లు గుర్తించారు. నాణ్యత లేని బాదం ప్యాకెట్లను గుర్తించారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

మాజీ ఎంపీ వి.హనుమంతరావు


నిరసనలో వీహెచ్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు తదితరులు

రాంనగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. అమిత్‌షా దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వీహెచ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షా మంత్రిగా కొనసాగే అర్హత లేదన్నారు. సునీతారావు మాట్లాడుతూ పార్లమెంట్‌లో జరిగిన వివాదంలో రాహుల్‌గాంధీపై హత్యాయత్నం కేసు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. అంబేడ్కర్‌ను అవమానించిన బీజేపీకి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, బీహార్ సీఎం నితీష్‌కుమార్‌లు తమ మద్దతును ఉపసంహరించుకుని తమ వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షురాలు కవిత, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల నిర్మలారెడ్డి, కార్యదర్శి సుగుణ, నాయకురాలు శైలజ, కల్పన, విజయలక్ష్మి, చాముండేశ్వరి, యూసఫ్, సంగిశెట్టి జగదీష్, శంభుల శ్రీకాంత్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.